# మొగుడు భాగోతం!

కె. రామలక్ష్మి

రుసరుసలాడుకుంటూ సుందరి కూరలు తరగబోతూ చెయ్యి కోసుకుంది. అంత ఒళ్లు మండిపోతోంది సుందరికి. 'ఈ మొగాళ్లని అర్థం చేసుకుందుకు చిన్న ఎత్తు స్క్కూళ్లు నడపాలి' అనుకుంది—రక్తం రాకుండా చూపుడువేలు గట్టిగా నొక్కి పట్టు కుంటూ. ''అయినా కూరలుతరగడమేనా చేతకాకపోవడం ఏమిటి సుందరీ?'' స్నానం ముగించుకుని ఆ తడికాళ్లు కాస్తా గోదిళీమీదేనా ఆన్చకుండా యిల్లంతా తడి చేసుకుంటూ గదిలోకి నడిచాడు రామారావు. సుందరి చూపులు అతని వీపుని గుచ్చుకుని వాలిపోయాయి. 'ఇనప వీపు' అనుకుంది.




రోజూ యింతే. ఉదయం లేస్తూనే మొగుడూ పెళ్లాలకి గొడవ.

లేస్తూనే 'కాఫీ పట్రా' అంటాడు రామారావు.

''చేసి తెస్తాను'' అంటుంది సుందరి.

పళ్లు పటపట కొరుకుతాడు ఆ జవాబు విని.

గోముగా నవ్వేస్తూ వంటగది ప్రవేశం చేస్తుంది సుందరి. ఇక వంటయ్యేదాకా అక్కడే ఆమె మకాం.

ఇంట్లో మాటలులల అలా గాలిలో అటునుంచి యిటూ, యిటు నుంచి అటూ పేలాల్లా పేలుతూ తిరుగుతూ వుంటాయి.

చూడ్డానికి చిలకా గోరింకల్లాగానే వుంటారు. కాని వాళ్లలో వాళ్లకి అస్సలు అవగాహన లేదో ఏమో షార్ట్ సర్క్యూట్ అయినట్టు పటపట పేలిపోతూంటాయి వారి మాటలు.

మొదటి రాత్రి రామారావు పెళ్లాం అందం చూసి మైమరిచిపోయి ''చూడు సుందరీ! మన మధ్య దాపరికా

లొద్దు. సూటిగా మనసులో మాట చెప్పేసుకోవాలి. ఏదీ నా చేతిలో వెయ్యేసి ఒట్టెయ్యి'' అన్నాడు.

సుందరి ప్రేమగా అతని ముఖంలోకి చూసింది. 'మీరెంత మంచివారండీ' అందామనుకుంది. కాని అదే నిజమనుకుంటే యిప్పటి మంచి యిబ్బంది అనుకుని మౌనంగా చేయి చాపి అతని చేతిలో చెయ్యి వేసింది. ''మీకు కోపం రాదుకద'' అంటూంటే, ''ఛ కోపమా? నీ మీదా? ఎందుకొస్తుంది?'' అన్నాడు సుందరి చేతిని ప్రేమతో నలిపేస్తూ.

''ఏమో...'' వినీ వినబడనంత నెమ్మదిగా అంది సుందరి.

''నాకు కోపం రాదు సరి కదా నీ మీద యిష్టం ఎక్కువ అవుతుంది'' అంటూ లైటార్పి భార్యని దగ్గిరకి తీసుకున్నాడు రామారావు.

'ఇంత తొందరపాటా? ఓ మాటా పలుకూ లేదా' అందామనుకుని వూరుకుంది సుందరి.

అలా ప్రారంభం అయింది దాపరికం లేని వారి దాంపత్యం. రోజూ ఓ చిన్న ఎత్తు యుద్ధం తలెత్తబోయి ఆగడమే!

సత్య హరిశ్చంద్రుడు ఎంత యిబ్బంది పడ్డాడో యిద్దరికీ అర్థం కాసాగింది. కాని, అలవాటు చాలా బలమైంది. అందుకే ఆర్నెల్లలో వీరికీ నిజం చెప్పడం జబ్బు బాగ అలవాటైపోడం కాదు. ముదిరిపోయింది.

గలగల నవ్వుతూ స్నేహితులతో కబుర్లాడే రామారావు భార్యముందు జాగ్రత్తపడాల్సి వస్తోంది.

''సుందరీ ఈవేళ పప్పుచారు పెట్టు'' అనే ధైర్యం కూడా పోయింది. 'ఏమో తీరా నాకీ పూటకి ఉట్టిచారు పెట్టాలని వుందండీ' అంటే—అని భయం.

వారి సంసారం సైలెంటుగా సాగిపోతూంది.

అవసరమైన మాటలు చిన్న సైజు యాటం బాంబుల్లా పడుతూనే వున్నాయి.

ఒక రకమైన సైలెంట్ యుద్ధం కూడా ప్రారంభమైందా అన్న అనుమానం కలక్కమానదు వాళ్లని దగ్గిర నుండి చూసినవారికి.

నలుగురి మధ్యా ఒకరుండే కలకల.

నలుగురి మధ్యా వారిద్దరూ వుండే మౌనం.

ఏమిటీ వింత పరిస్థితి. రామారావు హితుడొకడు ఓనాడు ఓ గ్లాసు బీరుపోసి ''ఏమిటి భాయీ యిబ్బంది? ఎందుకు మీరసలు మాట్లాడుకోరు? దెబ్బలాడుకున్నారా?'' అని సాదరంగా అడిగాడు. ఆ ఆదరణ స్వరానికీ, తాగిన బీరుకీ రామారావు మనస్సు వెన్నలా కరిగిపోయి హితుని భుజంపై భోరున ఏడిచాడు 'యిల్లు నరకం, పెళ్లాం నరకం, సంసారం నరకం' అని.

'ఎదుటివాడి కష్టం వినడానికెంత బాగుంటుంది' అనుకున్న హితుడు యింకో బీరు పోయించాడు.

''భాయీ పెళ్లామా అది!'' అంటూ కష్టాలు చెప్పుకుని సేదదీరాడు రామారావు.

''ఇచ్చిన మాట చాలా చిన్నది. దాని మీద నిలబడ్డం ఏమిటి? ఇచ్చిన సంగతి మరిచిపోయి హాయిగా వుండు'' అని హితబోధ చేసి యింట్లో దింపాడు రామారావుని.

ఆ హితబోధ నచ్చింది రామారావుకి. ''సుందరీ పచ్చిపులుసు చేసి కందిపప్పు పచ్చడి చెయ్యి'' అన్నాడు




వస్తూనే.

''నావంట ఎప్పుడో అయిపోయింది. కాళ్లు కడుక్కువస్తే వడ్డిస్తాను'' అంది సుందరి కూర్చున్న చోటు నుంచి లేవకుండానే.

ఒళ్లు మండిపోయింది రామారావుకి. 'మొగుడన్న మర్యాద లేదు. నేను వస్తూంటే లేవకూడదూ? మూడు వంట అయిపోయిందంటుంది! ఏం కాస్తమళ్లీ చేస్తే ఏం పోయిందిట?' మండిపడిపోయాడు.

''నాకాకలి లేదు. నేను తినను'' అంటూ పడక గదికేసి నడవబోతూన్నవాడల్లా సుందరి లేవడం చూసి ఆగాడు.

''అయితే సరే, మూతలు పెట్టేస్తాను''అంటూ వంట యిల్లు ప్రవేశించింది సుందరి.

ఏం చేయలేక బోలెడు కోపం కట్టలు తెంచుకోగా గోడని ఒక్క గుద్దు గుద్దాడు. గదిలోకి చక్కాపోయాడు.

ఓ గంట తరువాత వచ్చి పడుకుంది సుందరి. అప్పటిదాకా నిద్రపోని రామారావు ఆమె మీద చెయ్యి వెయ్యబోయాడు.

''చెయ్యి తీసెయ్యండి. నాకిష్టం లేదు'' అంటూ కాస్త దూరంగా జరిగి పడుకుంది.

''సుందరీ నీతో మాట్లాడాలి'' అన్నాడు.

''పొద్దుట మాట్లాడండి.నాకు నిద్ర వస్తోంది'' అంది.

''నీకసలు ఏది ముఖ్యం? ఏది కాదు? అన్న విచక్షణ లేదేం?'' కోపంగా అన్నాడు.

''ఉంది. ఉంది కనుకే యిప్పుడు నిద్రపోవాలని అనుకుంటున్నాను. అయినా మీ ఉడుకుమోత్తనానికి నా దగ్గిర మందు లేదు''.

''కంది పచ్చడీ, పచ్చిపులుసూ చేయలేదని భోజనం మానగా లేనిది నాకు తెలియదా?'' నవ్వింది సుందరి.

''ఏం ఓ పూట చేసిపెడితే?''

''చేసిన వంట పారేయాలా?''

జవాబు చెప్పలేకపోయాడు.

''అయినా నువ్వు రేపు చేస్తాను అని ఉండొచ్చుగా?''

''ఎలా? తీరా రేపు మీకింకోటి తినాలనిపించదని గ్యారంటీ ఏమిటి? మీలాంటివాళ్లు ఒక పని చెయ్యరే...''

''ఏమిటి?''

''రోజూ పొద్దున్న కాఫీతోపాటే ఏం కావాలో చెప్పాలి. అంతేగాని లంచ్‌లో స్నేహితుల క్యారియర్లలోనివి చూసి నోరూరి చెప్పకూడదు'' స్పష్టంగా చెప్పింది సుందరి.

ఒళ్లు మండిపోయింది రామారావుకి.

''నువ్వెందుకిలా చేస్తున్నావో నాకర్థం కావడం లేదు?''

''ఏం చేస్తున్నాను? అనుకున్నది చెప్తున్నాను. మనం వేసుకున్న ఒట్టు మరిచిపోయారా?''

''అదో చిన్న మాట. దాన్ని పట్టుకుని...''

''పెళ్ళి—అదీ ఓ చిన్న మాటే!''

''అయితే దాని మీద మన భవిష్యత్తు ఆధారపడి లేదూ? అర్థం చేసుకోవేం?'' కసిరాడు.

ఒళ్లు మండింది సుందరికి.

''మీ దృష్టిలో ఏది పెద్దమాట? పెళ్లి అంటే పెళ్లాం మీ మాట వినడమే పెద్దమాట అవునా?''

''ఏంటే తప్పా?''

''కాదు. నేననేది మీరూ వినాలిగా అని''

''నేనుమగాడిని. మరీ పెళ్లాం చెప్పుచేతల్లో వుంటే ఆడంగి వెధవ అంటారు''.

''అలాగా? పోనీ మగాడివే పెళ్లాడలేకపోయారా? మీ చెప్పుచేతల్లో పడుండేవాడేమో?'' నవ్వింది సుందరి.

ఆమెనిటు తిప్పి నాలుగంటించాలనిపించింది అతనికి.

కాని చేయలేకపోయాడు. ఆమె నవ్విన నవ్వు అతణ్ని బలహీనుణ్ని చేసింది.

మరి మాట్లాడక పడుకున్నాడు నిద్రగాని నిద్ర కొరిగాడు.

ఉదయం లేస్తూంటేనే ''కాఫీ'' అన్నాడు మామూలుగా.

''చేసి తెస్తా—'' గది దాటేసింది సుందరి.

'ఇదిగో తెస్తున్నా' అనకూడదా ముఖం దుప్పట్లో దాచేసుకుంటూ మూలిగాడు రామారావు.

'అంతేకాదు. కందిపచ్చడి చేసినా పచ్చిపులుసు చేసినా ఈ పూట ఛస్తే తినని' శపథం చేస్తూ లేచాడు.

సుందరి కామాత్రం తెలియదా?

హాయిగా కూరలు తరుక్కుని చెయ్యి తరుక్కుంది! వంట బాధే లేదు.